వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 14 ఏప్రిల్ 2023

## టీచర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా



కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావుకు 1998 డీఎస్సీలో బుధవారం కడపలో జరిగిన కౌన్సిలింగ్ నందు ఉపాధ్యాయ ఉద్యోగం వరించింది. సిద్దవటం దిగువపేటలో అతనిని టీచరుగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. నీలి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి కడప జిల్లా అధ్యక్షుడిగా సేవలందించానని, 25 సంవత్సరాల నాటి టీచర్ పోస్టు ఒక కలగా ఉండేదని, ఆ కల నెరవేరుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, ఇంకా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో తమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలియజేశారు. మీడియాకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యం సహకరిస్తే రిటైర్‌మెంట్ తరువాత తిరిగి తన రెండో ఇన్నింగ్స్ రాజకీయంగా ప్రారంభిస్తామన్నారు.




కెఎస్ఆర్ఎం కళాశాల పూర్వ విద్యార్థిని శ్రీలతను వారి తండ్రిని కళాశాల కరస్పాండెంట్ మరియు ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి (నాని) చేతుల మీదుగా సన్మానం చేశారు.

# పేదల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యం

## ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :

పేదల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లె మండలం ఇడుపులపాయ గ్రామ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనరు చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచి ఆర్.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రాచనేని వేణుగోపాల్‌లు పాల్గొని ప్రతి గడప వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను శ్రద్ధతో విని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడే కానీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. వాడవాడల్లో వేడుకగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సాగింది. అలాగే మహిళలు, ప్రజలు పెద్దఎత్తున ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తూ ఘన స్వాగతం పలికారు. హారతి ఇచ్చి బొట్టుపెట్టి చల్లంగా ఉండాలని దీవించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్రం ప్రగతికి నోచుకోలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే దాపురించిన పరిస్థితులు చూశామని, వైకాపా ప్రభుత్వం వచ్చాక అభివృద్ధితో పాటు సంక్షేమానికి సంబంధించిన ప్రతి ఒక్కటి అమలు చేసి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ డీఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ సుక్రమ్‌రెడ్డి, ఏవో రాజేంద్రప్రసాద్, హెచ్‌వో రెడ్డెయ్య, ఏపీఎం బాలస్వామి, హజ్‌హౌస్ కమిటి డైరెక్టరు మునీర్, సర్పంచులు చలపతి, మునేష్, గోపాల్, నాయకులు వి.చంద్రశేఖర్‌రెడ్డి, వి.రామకృష్ణారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, కసిరెడ్డి ఆది, ఆర్‌ఎల్‌వి ప్రసాద్‌రెడ్డి, యువ నాయకుడు కావలి క్రిష్ణతేజ, కొండయ్య, దర్బార్, హుసేన్‌పీరా, అజీమ్, అంజి, శ్రావణ్, గోపి, మల్లయ్య, పుల్లయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. వేంపల్లెలోని బిడాల మిట్ట ప్రాంతానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు యూత్ కొండయ్య తండ్రి వెంకటేష్ గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆయన స్వగృహానికి చేరుకుని సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



**- రాయల్‌టైల్స్ ప్రారంభించిన ఎంపీ :**

పట్టణంలోని పులివెందుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ టైల్స్ పార్క్‌ను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ మన్ననలు పొందాలని యజమాని సమీర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనరు చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచి ఆర్.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రాచనేని వేణు, సివిల్ సప్లైస్ డైరెక్టరు షబ్బీర్‌వలి, మాజీ కోఆప్షన్ సాదక్‌వలి, తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో రీ సర్వే పక్రియ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నాం

### కలెక్టర్ గిరీష పి.ఎస్.

రాయచోటి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



జిల్లాలో రీ సర్వే ప్రక్రియ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ రాష్ట్ర భూ పరిపాలన కమిషనరు జి.సాయిప్రసాదుకు వివరించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై రాష్ట్ర భూ పరిపాలన కమిషనరు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ళు పాతడం, జిసిపి మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ (13)నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాలలో కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో హద్దురాళ్ళు పాతడం, ఖాతాలకు ఫోటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రీ సర్వే పూర్తయిన మండలాలకు ఇప్పటికే రోవర్లను పంపడం జరిగిందని, వాటి ద్వారా హద్దురాళ్ళు పాతే ప్రక్రియను తాసిల్దార్లు, సర్వే శాఖ సిబ్బందితో ప్రతిరోజు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రీ సర్వేకు సంబంధించి ఆయా ప్రక్రియల పనులను కూడా లక్ష్యం మేరకు నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

## ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన

చిన్నమండెం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్సార్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నమండెం మండలం బోనమల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. బోనమల, కన కంటి వారిపల్లె, నాగూరి వాండ్లపల్లె, గొల్లపల్లె, హరిజనవాడ, నగిరిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సంక్షేమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోనూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంఅ సిఎం జగన్ నిలుస్తారన్నారు. జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ జగన్ పాలన ఆదర్శంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర ్పంచ్ కొలిమి ఆఫ్రోజ్, ఎంపిటిసి వెంకటప్ప నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, బాబురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ అలీఖాన్, సర్పంచ్‌లు జగన్నాథ్ రెడ్డి, జనీర్ ఆహమధు, లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసిలు రమేష్, రెడ్డెప్ప, వైఎస్సార్ సిపి నాయకులు పెద్దప్పనాయుడు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీలు తదితరులు

## సకాలంలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలి

### - అన్నమయ్య జిల్లా జెవికె ప్రత్యేకాధికారి వెంకటకృష్ణారెడ్డి



రామాపురం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:

జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా జేవీకే-4 స్పెషల్ ఆఫీసర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యా కానుకలోని వస్తువులను నిల్వ జేసే ఆదర్శ పాఠశాలను గురువారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుక వస్తువులను నిల్వ చేయడనికి మండల విద్యాశాఖాధికారులు గుర్తించిన నిలువ కేంద్రాలు గల గదులను ఆయన పరిశీలించారు. వస్తువులను భద్రపరిచిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తల గుర్తించ పలు సూచనలు చేవారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున ్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కిట్లను సకాలంలో, సక్రమంగా అందజేసేందుకు ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేవీకే 4 మండల కమిటీ సభ్యులైన మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు, మండల ఏపిఎం మండల మిస్ కోఆర్డినేటర్ డేటా ఐఈఆర్‌టిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

### పులివెందుల సీఐ రాజుపై విచారణకు

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశం

**- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార నాయకులకు సహకరించినట్లు ఆరోపణలు**

**- ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి**

**- విచారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ, కలెక్టర్ ఆదేశించిన ఎన్నికల అధికారి**

కడప క్రైం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సీఐ రాజు అధికార పార్టీ నాయకులకు సహకరించారనే ఆరోపణలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా విచారణకు ఆదేశించారు. ఈమేరకు సీఐ రాజుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీజీపీకి, కడప కలెక్టర్‌కు ఆదేశాలు పంపారు. మార్చి 13న జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పులివెందుల పోలింగ్ కేంద్రానికి వైకాపా నాయకులు వెళ్తున్నా సీఐ రాజు వారిని నిలువరించకుండా సహకరించారని పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు వెళ్లకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ వై.ఎస్.మనోహర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి వెళ్లారని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో వారిని అడ్డుకునే ప్రయత్నం తాను చేసినా పక్కనే ఉన్న సీఐ తననే అక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. వైకాపా నాయకులు ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసుకునేందుకు సీఐ రాజు సహకరించారని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజుపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజల శాపనార్ధాలతో వైసిపి ప్రభుత్వం దగ్గరలోనే కాలగర్భంలో కలసిపోతుంది

### ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి అయిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల శాపనార్థాలతో కాలగర్భంలో కలిసిపోతుందని రమేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాడు చిన్నమండెం మండలం కొత్తపల్లె పంచాయితీ దీన్నేమీద పల్లె ,కురవపల్లె,వట్టం వాండ్ల పల్లె, శ్రీనివాసపురం, గువ్వపల్లె, శ్రీరామ్ నగర్ కాలని, వంక వాండ్ల పల్లెలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవని గుంతల మయమైన రోడ్లు ఉన్నాయని, పెంచిన నిత్యవసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు వల్ల పేదవారి నడ్డి విరుస్తుందని ప్రజలు చాలా బాధతో రమేష్ రెడ్డికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రిజర్వాయర్ క్రింద భూములు కోల్పోయిన రైతులకు గాని నిర్వాసితులకు గాని, ఎటువంటి పరిహారం అందకపోవడం దుర్మార్గం చర్య. రైతులు భూములను కోల్పోయి ఉపాధి కోల్పోయి ఆర్థికంగా దెబ్బలు తిని ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వం ఆదుకోకపోవడం ఒక నీతిమాలిన చర్య. అంతే కాకుండా ఇల్లు పోగొట్టుకున్న వారికి ఇంటి నష్ట పరిహారం, ఇల్లు పట్టాలు ఇంకా చాల మందికి ఇవ్వలేదు, ఆర్థిక సహాయం కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతూ ఆనందపడుతున్నాడని ఎద్దేవ చేశాడు. ల్యాండ్ అక్విసన్ పైన ఈ గౌర్నమెంట్‌కు అవగాహన లేదు, రైతులకు ఇవ్వవలసిన ఆర్థిక సహాయం సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా ఇవ్వలేదు బాధితులు భారీగా నష్టపోయారు. నష్టపోయిన వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని దొంగ పట్టాలు చేసుకొనికూడా ఆర్‌యన్‌ఆర్‌లో ఇల్లు కట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నారు.వీటి పైన చర్యలు తీసుకోవాల్సిందే చర్యలు తీసుకోకుంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అక్రమంగా ఎవరైతే పట్టాలు పొందినారో అక్రమంగా ఎవరైతే డబ్బులు తీసుకున్నారో వారందరినీ ముక్కు పిండి వసూలు చేస్తుంది తెలుగుదేశం ప్రభుత్వం కలెక్టర్ దీనిపైనే చర్య తీసుకోవాలి, నిర్వాసితులకు డబ్బులు ఇప్పించాల పూర్తి స్థాయిలో ల్యాండ్ అక్వేషన్ కు డబ్బులు ఇప్పించే బాధ్యత ఈ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చింది ఈ కలెక్టరే కాబట్టి బాధ్యత తప్పనిసరి చెయ్యాలని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ న్యాయం చేస్తానని సభాముఖంగా తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లం నరసింహ రెడ్డి, యూనిట్ ఇంచార్జులు అమర్నాద్ రెడ్డి, ఇంచార్జ్ దేవగోపాల్ నాయుడు, ఇంచార్జ్ చెన్నకృష్ణ రెడ్డి, బాసిత్ ఖాన్, బాకీవుళ్ళ ఖాన్, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, నూరు ఎకరాల రంగా రెడ్డి,మాజీ సర్పంచ్ ఖాదర్ భాష ,మల్లూరు వెంకటాద్రి, విశ్వనాథ రెడ్డి మల్లికార్జున రెడ్డి, రమేష్ రెడ్డి , హరినాథ రెడ్డి ,వండాది శ్రీనివాసులు రెడ్డి, నీళ్ళ వెంకటాద్రి ,గోపాల్ ,రమణ,,రేపన రమణయ్య, రఘునాథ, ఇ వెంకటేష్,కె నాగేశ్వర, ఏ. వెంకటరమణ, ఓ వెంకటాద్రి, రెడ్డేయ్య, రంగారెడ్డి, విశ్వనాథ, హనుమంతు నాయుడు, ప్రతాప్ నాయుడు, రెడ్డెప్ప ,సిరాజ్, రామచంద్ర, నాని, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ భూములకు రక్షణ

### త్వరలోనే సర్వే ఎండోమెంట్ కమిషనర్



ఎండోమెంట్ భూములను పరిశీలిస్తున్న ఉపసర్పంచ్ తోట శివసాయి, ఎండోమెంట్ కమిషనర్, శివాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని సాయిక్రిష్ణ థియేటర్ వెనుక భాగంలో శివాలయ భూములను ఉపసర్పంచ్ తోట శివసాయి, ఎండోమెంట్ కమిషనర్, శివాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడులు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు 11 సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్న ఈ భూములను ఉపసర్పంచ్ తోట శివసాయి సహకారంతో క్షుణ్ణంగా పరిశీలించి హద్దులను ఏర్పాటు చేసేందుకు సంబంధిత తహశిల్దారును సంప్రదించి వారికి అనుమతులతో శివాలయ భూములకు రక్షణ కల్పిస్తున్నామని ఎండోమెంట్ కమిషనర్ అన్నారు. శివాలయ భూముల్లో ఏవైనా అన్యాయం జరిగితే తప్పక కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, వారి కుమారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు టోకరా

### - ఇద్దరు నిందితులు అరెస్ట్

రాయచోటి, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుదో ్యగుల నుంచి రూ.6,90,000 వసూలు చేసిన ఘరానా మోసగాళ్లను అరెస్ ్ట చేసినట్లు రాయచోటి డిఎస్పీ శ్రీధర్ తెలిపారు. గురువారం డిఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ గుర్రంకొండలోని బలిజకుంటకు చెందిన ఎం. నవీన్‌కుమార్, ఎంబిఏ విద్యార్థి పూలుకుంట మహేష్‌లు కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులపై వల విసిరారన్నారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని, కలెక్టర్‌పివో, ఆఫీస్ అసిస్టెంట్ ఉదో ్యగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర నుండి రూ. 1,15,000 చొప్పున ఆరుగురి దగ్గర వసూలు చేశారు. అనంతరం ప్రభుత్వ ముద్రతో కూడిన నకిలీ నియామాక పత్రాలు తయారుచేసి అందజేశారు. నకిలీ నియామక పత్రాలతో ఉద్యోగంలో చేరుటకు అన్నమయ్య కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నిరుద్యోగులు మోసపోయామని తెలుసుకొని రాయచోటి పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి పోలీసులు ముద్దాయిలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి ప్రభుత్వ ఆఫీసులకు సంబంధించిన ముద్రణ అచ్చులు-13, మొబైల్ ఫోన్లు-2, ఒక ల్యాబ్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ శ్రీధర్ తెలిపారు. నిందితులు గతంలో కూడా రైల్వేశాఖ ఉద్యోగాలు ఇప్పిసా ్తమంటూ విజయవాడలో కొందరిని మోసం చేసి 55 లక్షలు వసూలు చేసినట్లు డిఎస్పీ తెలిపారు. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌లు లాంటి చెరడు వ్యవసనాలకు బానిసై అధిక మొత్తంలో చేసిన నిందితులు అప్పులు తీర్చడం కోసం ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు డిఎస్పీ శ్రీధర్ చెప్పారు. ఈ మేరకే కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసై ఇటువంటి ఘరానా మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చాకచక్యంగా వ్యవహరించి అనతి కాలంలోనే ముద్దాయిలను అదుపులోకి తీసుకున్న పట్టణ సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ నరసింహారెడ్డి, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, డిఎస్పీ శ్రీధర్ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బి.కొత్తకోట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



మృతి చెందిన భానుప్రకాష్

ఆటో-ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలై మృతి చెందిన సంగటన బి.కొత్తకోట మండలంలో వెలుగు చూసింది. బి.కొత్తకోట ఎస్సై రామ్మోహన్ వివరాల మేరకు మంగళవారం రాత్రి మదనపల్లి పీఅండ్‌టీ కాలనీకి చెందిన కోటకొండ భానుప్రకాష్ (29) వాహనంలో మదనపల్లెకు వస్తుండగా బి.కొత్తకోట-మదనపల్లి మార్గమధ్యలో నాయనబై వద్ద తనకు ఎదురుగా వస్తున్న ఆటో భానుప్రకాష్ వాహనాన్ని ఢీకొనడంతో అతనికి తీవ్ర రక్తగాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతనిని వెంటనే స్థానికులు 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు చికిత్సలు చేసి పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాను ప్రకాష్ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ సుదర్శన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## అవినీతి విఆర్‌ఏపై చర్యలు శూన్యం

### పొలంపైకి పోకుండా నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు

అన్నమయ్యజిల్లా ఏప్రిల్ 13, ప్రభాతవార్త

జిల్లాలోని గాలివీడు మండలంలో అక్రమపట్టాలు పొందిన విఆర్‌ఏపై అధికారుల చర్యలు శూన్యం. కాగా అతను అవినీతినుండి తప్పించుకోవడానికి కార్యాలయంలో చక్రం తిప్పుతున్నట్లు కార్యాలయ సిబ్బందే చర్చించుకొంటున్నారు. ఈనెల 8వ తేదీన వార్త దినపత్రిక అతని అక్రమాలపై సర్వేనంబర్లతో సహా బయటపెట్టింది. దీనిపై కలెక్టర్ గాలివీడు తహాశీల్దార్ కార్యాలయానికి విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. దీనిపై విచారణా అధికారిగా ఆర్ఐ ని నియమించారు. అతను ఫీల్డు పైకి వెళ్ళకుండా కార్యాలయంలో రికార్డుల ప్రకారం నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తూంది. ఇదంతా కార్యాలయంలో సదరు విఆర్‌ఏకు అనుకూలంగా ఉన్న ఓ అధికారి కనుసన్నల్లో జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతూంది. అయితే అతను చేసుకొన్న అక్రమ పట్టాలను ఆన్‌లైన్ చేయంచుకోవడంతో వాటి ప్రకారం విచారణ చేపడ్తే అక్రమాలు బయటికి వచ్చే అవకాశం ఉండదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ పట్టాలు పొంది అంతాతానై ఆన్‌లైన్ చేయించుకోవడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. విఆర్‌ఏ అక్రమాలు బయటపడాలంటే పొలంపైకి వెళ్ళి విచారణ జరిపితే పూర్తి అవినీతి బయటికి వస్తుంది. తహాశీల్దార్ చెప్పిన వివరణకు, విచారణాధికారి ఆర్ఐ చెప్పిన వివరణకు పొంతనలేక పోవడం గమనార్హం. అంతే కాకుండా సదరు విఆర్‌ఏ జగనన్న కాలనీలలో అతని భార్యతో పాటు బినామీ పేర్లతో పట్టాలు పొందినట్లు సహసిబ్బంది చర్చించుకొంటున్నారు. దీంతోపాటు గోరాన్‌చెర్వు పంచాయతీలోని1762 సర్వే నంబరులో ఇతని ప్రోద్భలంతో ఆక్రమించుకొన్న ప్రభుత్వభూమిపై విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతే కాకుండా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడ్తే విఆర్‌ఏ అక్రమాలు మరెన్నో బయటికి వస్తాయని పలువురు కోరుతున్నారు.

**తహాశీల్దార్ వివరణః** కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టాం. ఇటీవల సెలవులు రావడంతో ఆలస్యం జరిగింది. విచారణ జరిపి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

**విచారణాధికారి ఆర్ఐ వివరణః** ఈ విషయంపై విచారణాధికారిగా నియమించిన ఆర్ఐ వివరణ కోరగా తాను కార్యాలయంలో ఉన్న రికార్డుల ప్రకారం పూర్తి నివేదికను డిప్యూటీ తహాశీల్దార్‌కు అందచేశామని తెలిపారు.

## పెండింగ్ క్లైయిమ్స్, అబ్జెక్షన్స్‌ను త్వరగా డిస్పోజ్ చేయాలి

### వీడియో కాన్ఫరెన్సలో కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

రాయచోటి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



పెండింగ్ క్లైయిమ్స్, అబ్జెక్షన్స్ ను త్వరగా డిస్పోజ్ చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. లిగురువారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ....సుమోటోగా ఓటర్లను తొలగించరాదని, నోటీస్ ఇచ్చిన తర్వాత సరిచూసుకుని మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఎల్ ఓ రిజిస్టర్ నిర్వహణ ఉండాలని, ఈ నెల ఆఖరిలోపు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఆర్ ఓ నెట్ 2.0 ఈ నెల 17 నుండి అందుబాటులోకి రానున్నదని అన్నారు. పెండింగ్ క్లైమ్స్, అబ్జెక్షన్స్ పై దృష్టి సారించి పరిష్కరించే దిశలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు ఎలెక్టోరల్ రోల్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఈవిఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ పేపర్, లా అండ్ ఆర్డర్, ఎలక్షన్ వ్యయం పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై ప్రణాళిక రచించుకుని ఒక పద్ధతిగా ముందుకు వెళ్లేలా ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి ఎస్ఓపి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి ఉండేలా నెల ఆఖరిలోపు ఒక మ్యాన్యువల్ తయారు అవ్వాలని సూచించారు. ఈవిఎంలు, వివి ప్యాట్ వాటి సంబంధిత పరికరాలను భద్రపరుచుటకు గోడౌన్ లు పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాలు మేరకు అందుబాటులో ఉండేలా చూడాలనీ, తొందరలోనే ఈవిఎం, వివిప్యాట్, బియు, సియు, బ్యాటరీ తదితరాలు అన్ని జిల్లాలకు అందేలా షెడ్యూల్ ను పంపుతామని సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీషా పిఎస్, డిఆర్ ఓ సత్యనారాయణ, ఎన్నికల సూపరింటెండెంట్, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలలో పన్నుల వసూళ్లలో అలసత్వం వహించరాదు

– డీపీవో ధనలక్ష్మి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ పన్నుల వసూళ్లలో అలసత్వం వహించరాదని డీపీవో ధనలక్ష్మి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుద్ధ్యం లోపించరాదని ఎప్పటికప్పుడు చెత్తబండ్ల ద్వారా చెత్త నిల్వ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. వేసవి కాలం దృశ్య పంచాయతీలో తాగునీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు కార్యదర్శి నిఘా పెంచి నీటి సమస్య ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పంచాయతీల ఆదాయ వనరులతో పంచాయతీ అభివృద్ధి పనులను సర్పంచ్‌ల సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులను పెంచుకొని అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డులను ఉపయోగించుకొని గ్రీన్ అంబాసిడర్ ద్వారా చెత్త సేకరించి తద్వారా సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేసుకొని స్థానిక రైతులకు అందించాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని చేపల చెరువు, వారపు సంతలు వేలం పాటల ద్వారా పంచాయతీ ఆదాయం ఎంచుకోవాలన్నారు. కార్యకర్తలు ఎప్పటికప్పుడు పంచాయతీ గ్రామాలలో నిఘా పెంచి సమస్యలు పరిష్కరించి మీదో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పంచాయతీల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. తొలుత ఆమె ఎంపీడీవో ఆనంద్‌కుమార్‌తో కలిసి ఎర్రసానిపల్లె వద్ద గల డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆర్‌బికేలో మట్టి నమూనా సేకరణకే లక్ష్యం

వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివశంకర్

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :

రైతు భరోసా కేంద్రాల ద్వారా మట్టి నమూనా సేకరణకై లక్ష్యాలు నిర్దేశించి రైతుల పొలంలో మట్టి నమూనాలు సేకరించి భూసార ఫలితాలను రైతులకు అందజేయడం జరుగుతుందని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివశంకర్ తెలిపారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయిలో ఆర్‌బికే సిబ్బందికి మట్టి పరీక్షల ఆవశ్యకథ, మట్టినమూనాల సేకరణపై శిక్షణా కార్యక్రమం ఏఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏడి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించినట్లు అయితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. పంట మార్పిడి ద్వారా కూడా అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. రైతులకు ప్రభుత్వం మంజూరు చేసే వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రతి పథకం ఆర్‌బికే ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే ప్రతి ఆర్‌బికిలో మట్టి నమూనా సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. భూమి సారవంతంగా ఉంటేనే వ్యవసాయ రంగంలో రైతులు రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటరమణ, ఆర్‌బికే చైర్మెన్‌లు పాల్గొన్నారు.

## వెలుగు ప్రత్యేక పాఠశాలలో అన్నదానం

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



వైఎస్ఆర్ సిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు భువనేశ్వరిసత్య జన్మదినం సందర్బంగా వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. తొలుత అనాథ పిల్లలు, బుద్ధిమాంద్య చిన్నారులు, వృద్ధుల సమక్షంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ వెలుగు ప్రత్యేక పాఠశాలలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయమోహన్‌రెడ్డి, నాగరాజ, రెడ్డిశేఖర్, రెడ్డెప్ప, మణి, సోము, సూరి,రవి, జగదీష్ పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నాయకులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని రాజంపేట పార్లమెంటు బిజెపి అధ్యక్షులు డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇటీవల బిజెపి అగ్రనాయకుల సమక్షంలో కిరణ్‌కుమార్‌రెడ్డి బిజెపిలో చేరిన విషయం తెలిసిందే. రాష్ట్రంతో పాటు రాజంపేట పార్లమెంటులో బిజెపి బలోపేతానికి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి సూచించినట్లు డాక్టర్ తెలిపారు. త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు. వీరి వెంట అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ పాల్గొన్నారు.

## మహిళా అభివృద్ధికి తపాలశాఖ చేయూత

జిల్లా పోస్టల్ సూపరింటెంట్ చిన్నకేశవులు

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



మహిళల ఆర్థికాభివృద్ధికి తపాలాశాఖ ఆధ్వర్యంలో కేంద్రం చేయూత ఇవ్వనున్నట్లు జిల్లా పోస్టల్ సూపరిండెంట్ చిన్నకేశవులు తెలిపారు. గురువారం మదనపల్లె పోస్టల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖలో నూతనంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో చేరిన మహిళలకు తక్కువకాలంలో అధిక వడ్డీ పొందేఅవకాశం ఉంటుందన్నారు. ఏప్రిల్ 1నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. కేవలం మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. పథకంలో చేరదలచిన మహిళలు తమ సమీప పోస్టాఫీసుల్లో సంప్రదించ మహిళా సమా బజత్ పత్ర యోజనా ఫారాన్ని పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఫారంతో పాటు ఆధార్, పాన్‌కార్డు, మూడు పాసుపోర్టు సైజ్ ఫోటోలను జతపరచాలన్నారు. రెండు సంవత్సరాల కాల పరిమితి గల ఈ పథకంలో రూ.1000ల నుంచి రూ.2లక్షల వరకు మహిళలు పెట్టుబడి పెట్టవచ్చునన్నారు. ప్రతి ఏటా పెట్టుబడులపై 7.5శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2025 మార్చి 31కి ఈ పథకానికి చివరితేది అన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె పోస్టల్ ఏఎస్‌పి బి.నీలమ, హెడ్‌పోస్టుమాస్టర్ డివి.రమణమూర్తి, ఉద్యోగులు పి.అమరనాథ్, డి.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానం

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :

మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఫోస్టులకు ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండ్ంట్ డాక్టర్ పద్మాంజలీదేవి తెలిపారు. గురువారం డాక్టర్‌మాట్లాడుతూ ఆసుపత్రిలో ఒక్క వైద్యుడు, రెండు కౌన్సిలర్, రెండు వార్డుబాయ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు అన్నమయ్య ఏపిజిఓవి ఇన్ అనే వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదిన సాయంత్రం 5గంటల లోపు పోస్టుద్వారా కాని, నేరుగా గాని దరఖాస్తులను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి చేరవేయాలని తెలిపారు.

## భాదిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



పట్టణంలోని నీరుగట్టు వారిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు వెంకటేశ్వర్లు సూసైడ్‌నోట్ రాసి అప్పులబాధతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్న విషయం విధితమే. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం జిల్లా ఆసుపత్రికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడిసరుకుల ధరల అమాంతంగా పెరిగిపోయి, తయారు చేసిన చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో చేనేత రంగం కేదేలైందన్నారు. అప్పులు చేసి తీర్చలేక రుణదాతల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగానే కార్మికుల మరణాలు ఎక్కువైనట్లు తెలిపారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు ఇంటిస్థలం మంజూరు చేయాలంటూ ఆయన డిమాండ్ ఏశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కార్మిక కుటుంబాలను ఆదుకొంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బాలమౌలి, శేఖర్, ఇంతియాజ్, నాగూర్‌వల్లి, భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీతప్పను అభినందించిన మాజీ ఎమ్మెల్యే

రామసముద్రం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



రామసముద్రం మండలం చెంబకూరు పంచాయితీకి చెందిన టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ గజ్జల సీతప్పను మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ గురువారం అభినందించారు. మండలానికి చెందిన 9వ క్లస్టర్ ఇంచార్జ్ శీతప్ప జోనల్ గ్రేడింగ్‌ల్లో ఉత్తమ రికార్డును సాధించడం గర్వకారణమని దొమ్మలఎటి రమేష్, ఆర్‌జె.వెంకటేష్ తెలిపారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమిస్తూ మరింత ఉన్నత పదవులను అలంకరించాలని ఆయన ఆకాక్షించారు. ఈ అవార్డు రావడంతో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు సీతప్పకు అభినందనలు తెలిపారు.

## హనుమాన్ గుడివద్ద స్వచ్చాభారత్ కార్యక్రమం

కురబలకోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



మండలంలోని అంగ ళ్ళు సమీపాన శ్రీఆంజనేయ స్వామి గుడివద్ద గురువారం బిజెపినాయకులు స్వచ్ఛాభా రత్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా బిజె పి రాష్ట్ర కోఆపరేటీవ్ కన్వీ నర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛాభారత్ కార్యక్రమం కింద విరివిగా మొక్కల ను నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం గుడివద్ద వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, రవీం ద్ర, మనోహర్‌గౌడ, శోభారాణి, సాయి, లక్ష్మిదేవి, రాజారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు అడిగిన చిలిపి ప్రశ్నలకు చలాకీగా జవాబులు చెప్పిన అక్సా

పీలేరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః



ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల జనిత్2కే 24 జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం ఈవెంటులో భాగంగా గురువారం అనేక కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా మధ్యాహ్నం ఈటీవీ, ఢీ-10 డాన్సు ప్రోగ్రామ్‌లో పోటీదారుగా పాల్గొని పలువురు ప్రశంసలు అందుకున్న డాన్సర్, పలు తెలుగు చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఆక్సా ఖాన్ పాల్గొని తన డ్యాన్సు పర్ఫామెన్సుతో కళాశాల విద్యార్థులను ఉత్సాహంతో నింపింది. ఆస్కార్ అవార్డు సాధించిన నాటునాటు పాటకు మైండ్ బ్లోయింగ్ డాన్సు చేసి విద్యార్థులను అలరించింది. అంతకుముందు కళాశాల విద్యార్థులు మీకు ఇష్టమైన హీరోలు ఎవరు అని అడగగా జూనియ్ ఎన్టీఆర్ , మహేష్‌బాబు అని జవాబుచెప్పింది. తను మధ్య ప్రదేశ్ నుంచి వచ్చానని ఇప్పుడు తెలుగు అమ్మాయిగా టాలీవుడ్‌లో స్తిరపడిపోయానని, తాను చదువుకోలేదని డాన్సులే తన చదువు అన్నారు. ఎంజేఆర్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్తులు నవ్య, భవ్య, హరిచందన బందం చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంజేఆర్ కళాశాల ఛైర్మన్ అవినాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ద్వారకనాధరెడ్డి, విద్యార్తులు పాల్గొన్నారు.

## ప్రజలందరికి శుద్ద జలం

పీలేరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః



పట్టణ ప్రజలందరికి శుద్ద జలం అందచేలా ఎంపీ మిథున్‌రెడ్డి చొరవ చూపుతున్నట్లు పీలేరు సర్పంచి హబీబ్‌బాషా తెలిపారు. ఈనెల 17వ తేదీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆర్వో ప్లాంట్లను ప్రారంభించనున్న నేపథ్యంలో సర్పంచి వాటిని పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో టీబీ రోదులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈకార్ యక్రమంలో నాయకులు చలపతి , నరసింహారెడ్డి, ఇబ్రహీం, మహిత, డాక్టర్లు కార్తీక్, చంద్రశేఖర్ నాయక్, మోహన్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్నే మాభవిష్యత్తుకు విశేష స్పందన

కేవి.పల్లె , ఏప్రిల్ 13 ప్రభాతవార్తః



మండలంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా చే వ ట్టు తు న్నా రు. గురువారం ఎం.వి.పల్లె , వగళ్ల, తువ్వపల్లె, జిల్లేళ్ళమంద పంచాయతీ సర్పంచిలు అధ్యర్యంలో మాననమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు తెలియజేసి ప్రభుత్వాన్ని మరోసారి బలపరచాలని కోరారు. ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈకార్యక్రమంలోలో సర్పంచిలు రత్నాకర్‌రెడ్డి, ఆనందరెడ్డి, రామకొండారెడ్డి, రెడ్డికాంతమ్మ, ఈశ్వరయ్య, గడ్డం రెడ్డెప్పరెడ్డి, రాజారెడ్డి, వారాధిరెడ్డి, సురేంద్రరెడ్డి , శ్రీనివాసులు, సుధాకర్, ధనుంజయ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక జిల్లా పరిశీలకులు తనిఖీ

కేవి.పల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః

ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల పరిశీలకులు అన్నమయ్య జిల్లా జేవీకే స్టాక్‌పాయింట్ పరిశీలకులు వెంకటకష్ణారెడ్డి గురువారం కేవి.పల్లె మండలంలోని జగనన్న విద్యాకానుక 2023-24కు సంబంధించి స్టాక్ పాయింట్‌ను ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీచేశారు. అన్ని మెటీరియల్‌కు సరిపడా స్థలం ఉందా, అని వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. స్టాక్‌పాయింట్ పరిశీలన అనంతం జేవీకే 4 మండట టీము సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రిసీవింగ్ అండ్ డిస్పాచిర్ కమిటీ ఛైర్మన్‌గా మండల విద్యాశాఖాధికారి వ్యవహరించాలని కన్వీనర్‌గా ప్రతిపాదిత స్టాక్ పాయింట్ పాఠశాల హెచ్ఎం సభ్యులుగా ఎంఐఎస్ కోఆర్డినేటర్ కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్ సీఆర్పీలు ఒదరూ ఉంటారన్నారు. బందాలుగా ఏర్పడి పకడ్బందీగా జగనన్న విద్యాకానుక కిట్లును పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. పది పబ్లిక్ పరీక్షల సెంటర్లు జడ్పీహైస్కూల్, కేవిపల్లె సెంటర్లను తనికీచేసి ప్రశాంత వాతావరనంలో పరీక్షలు జరిగేలా చూడాలని తెలిపారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ రెడ్డిబాషా, రెడ్డిప్రదీప్, మంజు, మధుసూదన్ సీఆర్పీలు పాల్గొన్నారు.

## మానమ్మకం నువ్వే జగన్ మాభవిష్యత్తు నువ్వే కార్యక్రమం

కేవి.పల్లె , ఏప్రిల్ 13ప్రభాతవార్తః



కేవి.పల్లె మండలంలో మానమ్మకం నువ్వే జగన్ మా భవిష్యత్తు నువ్వే కార్య క్రమం మండల యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి, జడ్పీటీసీ గజ్జల శ్రుతి, కన్వీనర్ వెంకటరమణా రెడ్డి, సచివాలయ కన్వీనర్, సతీష్‌కుమార్‌రెడ్డి, గహసారధి వలంటీర్లుతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ పీలేరు నియోజకవర్గ సభ్యులు జీవి.శ్రీనాధరెడ్డి పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు అందరికి అందుతున్నాయా లేదా అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసు కున్నారు. అర్హులు అయి ఉండి సంక్షేమ పథకాలు అందనివారు సచివాలయ సిబ్బంది ద్వారా అందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లును అతికించారు. ఈకార్యక్రమంలో

## ఎన్‌సిసి విద్యార్థులకు శిక్షణ

కురబలకోట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ::



మిట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులకు చిత్తూరులోని పివికెఎన్ కళాశాలలో తలతైనికం క్యాంపు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. 35వ ఆంధ్రా బెటాలియన్ వారు ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులకు శారీరకంగా, దృడంగా, మానసికంగా మార్చే శిక్షణను ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులు ఫైరింగ్, స్లైట్, బ్యాలెన్స్, క్లియర్‌జంప్, బ్యాలెన్స్, రైటహ్యాండ్‌వాల్ట్, లెఫ్ట్‌హ్యాండ్‌వాల్ట్ ర్యాంపుపై శిక్షణను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

– శంకర్ యాదవ్

ములకల చెరువు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెదేపా అధికారంలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ములకల చెరువు మండలం కొనేటివారిపల్లె పంచాయతీలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్ యాదవ్ మరియు మండల కన్వీనర్ పాలగిరి సిద్ద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ రైతుల సమస్యల గురించి అక్రమ ఇసుక విధానం గురించి, విద్యుత్తు ఛార్జీలు పెంపు వంటి అనేక సమస్యల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెదేపాను గెలిపించుకొని వైకాపాకు చరమగీతం పాడాలన్నారు. అలాగే మన తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే తెదేపా ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మహిళా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, తెదేపా అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం జయప్రదం చేయండి

బి.కొత్తకోట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ మరియు అనుబంధ సంఘాల జాతతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.చిన్న మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా ఈ నెల 17, 18 తలేదీల్లో తిరుపతి కేంద్రంగా జరిగే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మరియు అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయడానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్మ చిన్న పిలుపునిచ్చారు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు

కేవి.పల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్తః



మండలంలోని గ్యారంపల్లెలో రైతు భరోసా కేంద్రం నందు గురువారం భూసార పరీక్షలపై రైతులకు మండల స్థాయిలో వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలు ఎలా సేకరించాలి, సేకరించిన మట్టి నమూనా ఫలితాలను రైతులకు ఏవిధంగా విశ్లేషించాలి, మట్టి సేకరణ వల్ల కలిగే ఫలితాల గురించి వివరించారు. మండల స్థాయిలో ఒక్కొక్క ఆర్‌బీ సెంటర్ నుంచి రెండేసి మట్టి నమూనాలను సేకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఏపీ ఉమామహేశ్వరమ్మ, పీలేరు ఏడీఏ రమణరావు, ఏఓ శ్రావణి బోదేషావలి పాల్గొన్నారు.

## బహిరంగ చర్చకు సిద్దంగా ఉన్నాను

– ఎంపిటిసి రమణ

పోరుమామిళ్ళ రూరల్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:

బహిరంగ చర్చకు సిద్దంగా ఉన్నానని, వాస్తవాలను తెలుసుకొని ఆరోపిస్తే బాగుంటుందని ప్రజా సంఘాలకు ఎంపిటిసి కలవకూరి రమణ పిలుపునిచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఉన్న నాపై అవాస్తవాలు మీడియా పత్రికా పరంగా తెలపడం బాధాకరమని ఏదైనా వాస్తవాలు నిజానిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని ఎంపిటిసి రమణ పేర్కొన్నారు. ఎంపిటిసిగా అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తున్నానని ఎవరికి అన్యాయం జరగకూడదనే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార యక్రమంలో కల్లూరు రాజమోహన్‌రెడ్డి, చెరుకూరి చెన్న కృష్ణయ్య, మునగాల మురళీ, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎండీకి ధన్యవాదాలు తెలిపిన జోనల్ అధ్యక్ష కార్యదర్శులు

కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.కుమార్, రాజశేఖర్‌లు గురువారం ఆర్టీసీ ఎండీని కలిసి మే 24న జరుగుతున్న మన రాష్ట్ర మహాసభలకు ఆహ్వానించడం జరిగింది. ఈ మహాసభలకు తప్పక వస్తానని తెలిపారు. అలాగే ఎండీని కలిసిన సందర్భంగా ఈనెల 4 నుంచి 30 రెగ్యులైజేషన్‌లో ఏడీ/పీడీ/ఎస్‌పీడీలో పనిచేస్తున్న క్లరికల్ సిబ్బంది క్రమబద్దీకరణ సమస్య గురించి మాట్లాడడం జరిగింది. దీనిపై ఎండీ స్పందిస్తూ ఈనెల 4నే దానికి సంబంధించిన సమాచారం తెప్పించుకోవాలని ఆదేశాలు ఇచ్చాను. అందరికీ న్యాయం చేయడం జరుగుతుందన్నారన్నారు. ఈ నెల 30న రెగ్యులేషన్ సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎండీ తీసుకున్న ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఈయూ జోనల్ కమిటీ తరపున ఎండీకి పలిశెట్టి దామోదర్ నేతృత్వంలోని రాష్ట్ర కమిటీకి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :



కొండాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని లావనూరు గ్రామం కాసర్లకుంట సత్రం వద్ద రోడ్డుపై చనిపోయి పడి ఉన్న ఎనుమును బుధవారం రాత్రి 11.00గంటల సమయంలో చంద్రప్పగారి చంద్రన్న, మాలెపాటి రవిలు ద్విచక్రవాహనంలో వెళ్తూ ఢీకొన్నారు. కొండాపురం ఎస్పై సత్యనారాయణ వివరాల మేరకు.. సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామానికి చెందిన చంద్రన్న (48), మాలెపాటి రవి(50) పని నిమిత్తం కొండాపురానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఈ సంఘటన జరిగినట్లు ఎస్పై తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రన్న మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై తెలిపారు.

## జగనన్న పాలనపై ప్రజలకు అపార విశ్వాసం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :



ప్రజలు ఏ ఇంటికి వెళ్లినా జగనన్నే మా భవిష్యత్తు అంటూ జగనన్న పాలనపై అపార విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని 28వ వార్డు కౌన్సిలరు షేక్ గుల్జార్‌బేగం పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో కౌన్సిలరు గుల్జార్‌బేగం, వైకాపా నాయకుడు మస్తాన్, సచివాలయ సారధుల ఆధ్వర్యంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్ఆర్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

## చంద్రబాబునాయుడును కలిసిన సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ళ రూరల్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. చంద్రబాబునాయుడు సర ్పంచ్‌ను అభినందించి మరింత ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూ తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో భారీ విజయం సాధించే దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని చెప్పడం జరిగింది. సుధాకర్‌ను ఆశీర్వదించడం జరిగింది.

## రాఘవరాజపురంలో జగనన్నపై నమ్మకం కార్యక్రమం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం గ్రామ పంచాయతి పరిధిలో సర్పంచ్ డాక్టర్ నాగలక్ష్మీ, రుద్దిరాల రమణ ఆధ్వర్యంలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమంలో ఘనంగా ముఖ్యమంత్రి చిత్రపటాలను గ్రామంలోని ఇంటింటికి అందజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు రమణ మాట్లాడుతూ ప్రజల్లో చెక్కుచెదరని విశ్వాసాన్ని సంపాదించుకొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, మంచంలో అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు ముఖ్యమంత్రి చిత్రపటాన్ని చూడగానే చటుక్కున లేచి ముఖ్యమంత్రి చిత్రపటానకి ముద్దులతో ఆశీర్వదించిందని ఆయన పేర్కొన్నారు. రాఘవరాజపురం గ్రామంలో ఏ ఇంటికి వెళ్లిన చక్కటి ఆదరణ లభిస్తున్నదని ఆర్‌వి రమణ పేర్కొన్నారు.

## బిజెపి, వైసిపి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనపై నేటి నుండి వామపక్షాలు పాదయాత్ర

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నేటి నుండి పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి సి.రవికుమార్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వామపక్షాల నేతలు పాదయాత్రకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సామాన్య ప్రజలకు మేలు చేయకుండా కార్పొరేట్ వ్యక్తులకు మోడి ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేసి పని చేస్తుందన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా. అరాచకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవర, ఏరియా సహాయ కార్యదర్శి ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నిరుపేదకు వైద్యం అందించాలి

– మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

బి.కొత్తకోట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



మండలంలోని ప్రతి నిరుపేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సహకారంతో ఆసుపత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు నియామకం జరిగే ఆసుపత్రిలో ప్రతి ఒక్కరికి అన్ని విధాలా మెరుగైన వైద్య సౌకర్యానికి కృషి చేసినట్లు తీర్మానించారు. అదే విధంగా ఈ మధ్య బి.కొత్తకోట ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి నూతనంగా చిన్నపిల్లల వైద్యనిపుణులు సతీష్ నాయక్‌ను నియమించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో సైతం ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరై నిరుపేదలకు వైద్య సేవలు అందించి తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.ఆరీఫుల్లా, డా.హసీనా, హరీష్, సత్య, వైద్య సిబ్బంది, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దువ్వూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులో వైకాపా మండల కన్వీనర్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కల వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని అందులో భాగంగా వైఎస్ఆర్ ఆసరా, అమ్మఒడి, ఈబీసీ నేస్తం తదితర కార్యక్రమాలు ఎన్ని ఇబ్బందులున్నా సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజాపీర్, ఇమాంబాషా, బందేకాన్, అమీర్‌బాషా, నాసిర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై సమీక్ష సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :



మండలంలోని తిమ్మాపురం రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి అరుణ ఆధ్వర్యంలో గురువారం భూసార పరీక్షలపై ఆర్‌బీకే ఇన్‌ఛార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలు జరిపించడం ద్వారా ఆ నేలలో ఏయే పంటలు వేసుకోవాలి అన్న విషయంతో పాటు భూమిలో ఏ పోషకాలు లభ్యంగా ఉన్నాయి, ఏవి తక్కువగా ఉన్నాయో, వాటిని తగిన మోతాదులో వేసుకుని పెట్టుబడి ఖరు తగ్గించవచ్చునని తెలిపారు. మండలంలోని ప్రతి రైతు తమ ఆర్‌బీకే పరిధిలోని ఇన్‌ఛార్జిలను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకుని వాటి ద్వారానే ఎరువులు వాడాలని తెలిపారు. సమావేశం అనంతరం తిమ్మాపురం గ్రామంలోని కొండయ్య పొలంలో భూసార పరీక్షలు ఎలా తీయాలి అన్న విషయాన్ని ప్రయోగం చేసి చూపించారు.

– వీరపునాయునిపల్లె ః

వీరపునాయునిపల్లె మండలంలోని వెంకటాపురం రైతు భరోసా కేంద్రంలో మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. భూమి యొక్క సారాన్ని పరీక్షించి తెలుసుకునే పద్ధతిని భూసార పరీక్ష అంటారని వివరించారు. ఈ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ప్రకారం ఏయే పోషకాలు తక్కువ ఉన్నాయో గుర్తించి వాటిని మాత్రమే అందించడం వలన దిగుబడులు బాగా వస్తాయన్నారు. ఆ విధంగా రైతులు ముందుకు వెళ్లాలన్నారు.

## ఇఫ్తార్ పుణ్యకార్యం

చిన్నమండెం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



ఇఫ్తార్ పుణ్య కార్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం బోనమలలో సర్పంచ్ కొలిమి ఆఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులుతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు ఆకాంక్షించారు.

## ఆటో బోల్తా - ఇద్దరికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



మండలంలోని దొరి చెరువు వద్ద ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గురువారం లక్కిరెడ్డిపల్లె నుంచి వారి స్వగృహమైన చెంచర్లపల్లెకు ఆటో బాడుగకు తీసుకొని వెళ్తుండగా దొరి చెరువు వద్ద ఆటో కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న వేముల రమణమ్మ, వేముల రెడ్డమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనం ద్వారా లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## కెసి అగ్రహారంలో వైస్ ఎంపిపి ధ్వజారెడ్డిచే జగనన్నే మా నమ్మకం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని కెసి అగ్రహారంలో గురువారం జగనన్నే మా నమ్మకం కార్యక్రమంపై వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డిచే ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ దేశచరిత్రలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం ద్వారా అనతికాలంలోనే ఎన్‌రోల్ శాతం లక్షల్లో ఉందని, మొట్టమొదటిసారిగా ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది కుటుంబాలు ఎంతో ఆదరణ పొందాయని ఆయన అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఆ ఇంటి యజమానులు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని స్వచ్ఛందంగా అతికించుకుంటున్నారని అన్నారు. ప్రతి కుటుంబానికి ఎంతో ఆదరణ కలిగించే ఈ కార్యక్రమం ద్వారా ఎంతో ఉన్నతస్థాయికి ఈ కార్యక్రమం సాగుతోందని రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, పద్మనాభరెడ్డి, తిరుమలరెడ్డి, గంగిరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, దొంతిరెడ్డి రాజారెడ్డి, సుధాతో పాటు గ్రామంలోని ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగనన్న

రామాపురం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



రామాపురం మండలంలోని సరస్వతిపల్లి పంచాయతీ పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాయచోటి శాసన సభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సరస్వతి పల్లి గ్రామంలో సర్పంచ్ మునీర్ బాషా, వైఎస్సార్ సిపి స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రమణ సత్యా రెడ్డి, కేశవులు, దొరనాయుడు, కదిరప్పనాయుడు, కృష్ణారెడ్డి, స్థానిక వైఎస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వాలంటీర్స్

## సర్పంచ్ ఆధ్వర్యంలో మా నమ్మకం జగనన్నే కార్యక్రమం

వీరబల్లి, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



మండలంలో సానిపాయి పంచాయతీ సర్పంచ్ నేతి ఆంజనేయుల ఆధ్వర్యంలో మా నమ్మకం జగనన్నే అనే కార్యక్రమాన్ని గురువారం ఆయన పంచాయతీలో చేపట్టారు. ఆయన పార్టీ కార్యకర్తలతో, వాలంటీర్లు, గృహ సారథులుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి జగనన్న పరిపాలన గురించి వివరించారు. అంతేకాక జగనన్నే ఇచ్చే సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకోవడం జరిగింది. తిరిగి అధికారంలోకి జగనన్నే వస్తే రాష్ట్రం అభివృద్ధితో పాటు పేద ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి జగనన్నకే ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.

## వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజలకి నమ్మకం ఉంది

గాలివీడు, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరచిపోవద్దని సర్పంచ్ దీప్తి, ఎంపిటిసి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంజలిలు పేర్కొన్నారు. గురువారం వారు మాజీ ఎంపిటిసి చిన్నారెడ్డి, వైకాపా నాయకులు బ్రహ్మానందరెడ్డి, వెంకటశివారెడ్డి, వెంకటాద్రిలతో కలిసి మండలంలోని గోరాన్ చెరువు గ్రామం గేటు కుమ్మరపల్లిలో మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు శివగంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చెంగల్‌రాజు, ఆంజనేయరాజు, సుందరరాజు, ద్వారకనాథరెడ్డి, సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పులివెందుల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :



అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అంబేడ్కర్ 132వ ముందస్తు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ అభ్యున్నతిలో అంబేడ్కర్ పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, కళాశాల సిబ్బంది, బాలనారాయణ, హైమావతి, సాయిలీల, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డెన్న కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

రామాపురం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



మండలంలోని బండపల్లె పంచాయతీ దిగువ హరిజనవాడకు చెందిన ఒట్టికాళ్ళ రెడ్డెన్న ఇటీవల మృతి చెందారు. గురువారం ఉదయం దిగువ హరిజనవాడకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి రెడ్డెన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్డెన్న పార్టీకి చేసిన సేవలను శ్రీకాంత్‌రెడ్డి గుర్తుకు చేసుకుని వారి సేవలు మరువలేనివని, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి (బాబు), మాజీ ఎంపిపి కదిరన్న, మాజీ సర్పంచ్ మనోహర్, భరత్, రామ్మోహన్, అంజి, నాగలేసు, నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దముడియంలో భూసార పరీక్ష వారోత్సవాలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



పెద్దముడియం మండలంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయాధికారి పి.ఓబులేసు భూసార పరీక్ష వారోత్సవాలకు సంబంధించి క్షేత్ర స్థాయి సిబ్బందితో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం నుంచి రెండు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కేంద్రం ఊటుకూరుకు పంపుతామని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పొలంలో ఏ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయి, అలాగే రాబోయే సీజన్‌లో సాగు చేసే పంటకు పోషకాలు పరిమాణాన్ని వారు సూచించిన మేరకు వాడుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించి ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. భూసార పరీక్ష వారోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించడం జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ సంపన్నుడైనా.. పేదవాడట..!

వేంపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అపద్దాలు కవల పిల్లలని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అపద్దాలు చెప్పడం జగన్ దినచర్యగా అయిందన్నారు. రోజుకు 100 అపద్దాలు చెప్పడం ఆయనకు అలవాటు అయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో క్లాస్ వార్ జరుగుతుందని, ధనవంతులకు, పేదలకు మధ్య ఎన్నికల యుద్ధం జరుగుతుందని, తాను పేదవాడిని కనుక పేదల పక్షాన ఉంటానని జగన్ ఇటీవల ఓ బహిరంగ సభలో చెప్పారన్నారు. తనకు ఆర్థికబలం, అంగబలం, మీడియాబలం లేదని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అపద్దాలు చెప్పినా అతికినట్లు ఉండాలని పెద్దలు తెలిపారన్నారు. అపద్దాలు చెప్పడం మానుకోవాలని తులసిరెడ్డి జగన్‌కు సూచించారు.

## ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించాలి

కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



తెలుగు రాష్ట్ర ప్రజల మన్ననలను పొందిన సీఎంగా సేవలు అందించిన స్వర్గీయ ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న బిరుదు ప్రకటించాలని కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు అన్నారు. కడప నగరానికి చెందిన ఆర్కే సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్‌కు భారతరత్న బిరుదు ప్రకటించాలని వారికి పంపే కార్యక్రమంలో గురువారం అమీర్‌బాబు సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ ఎన్టీ రామారావు వంద జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారత రత్న బిరుదు ప్రకటించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, ఆర్‌కేఎస్ఎస్ అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

రామాపురం, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



విజువల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం రాత్రి జిల్లా ఎస్పీ కొత్త రోడ్డు నారాయణపురం వద్ద ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. రికార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం, ఇసుక, నాటుసారా, అక్రమ మద్యం, అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారకు. తనిఖీలు నిర్వహించే సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే శాఖపరమైన చర్యలు తీసుకుంటానని ఎస్పీ తెలియజేశారు.

## ఏపీఆర్ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ (అ) గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో నడుస్తున్న ఏపీఆర్ స్కూల్ జనరల్ బాలురు మరియు బాలికలు, ఏపీఆర్ స్కూలు మైనార్టీ బాలురు, బాలికల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి మరియు 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు మరియు ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయుటకు చివరి తేదీ ఈనెల 24 అని వివరాలకు హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. ప్రవేశ పరీక్ష మే 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## ఏపీఎండీసీ నిధులతో రైల్వేకోడూరులో మౌలిక సదుపాయాలు

– సీపీవో వెంకట రమణ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



ఇటీవల కాలంలో కొన్ని వార్తా పత్రికలలో ఏపీఎండీసీ యాజమాన్యం రైల్వేకోడూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గురించి పత్రికలలో ప్రచురించారని ఏపీఎండీసీ యాజమాన్యం రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పాఠశాల మరియు వైద్యశాలల నిమిత్తం ప్రతి ఏటా రూ.5.30కోట్ల తమ సంస్థ సామాజిక భద్రత నిధులు సీఎస్ఆర్ నుంచి ఖర్చు చేస్తున్నామని సీపీవో వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏపీఎండీసీ కార్యాలయంలో ఆయన విలేకరులనుద్దేశించి మాట్లాడుతూ కొన్ని పత్రికలలో కోడూరు అభివృద్ధి విస్మరించి నాయకులు, అధికారులు వేరే ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తున్నారని పత్రికల్లో వెలువడిందని అయితే ప్రభుత్వ వైద్యానికి రూ.90లక్షల నిధులతో ఆక్సిజన్, జనరేటర్ ప్లాంట్ ఇవ్వడం జరిగిందన్నారు. రైల్వేకోడూరులోని పార్కు, ఇతర పరిసరాల సుందరీకరణకు రూ.38లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైల్వేకోడూరు టౌన్, రామయ్యపల్లె, ఎస్టీ కాలనీలోని కమ్యూనిటీ హాలు మరమ్మతుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు రూ.10లక్షలు నిధులు విడుదల చేయడం జరిగిందని కోడూరులో 11 ఆర్వో ప్లాంట్లు, రూ.55లక్షల నిధులతో నిర్మించిందన్నారు. వైద్యశాలకు, చుట్టుపక్కల గ్రామాలకు, ప్రజల ఆరోగ్యాల మెరుగుకు ఏపీఎండీసీ సంస్థ ద్వారా నిధులు కేటాయించి వారికి మెరుగైన వైద్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. త్వరలో ఏపీఎండీసీ వైద్యశాలలో ఐసీయూ పరికరాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏపీ ఖనిజ అభివృద్ధి సంస్థ కోడూరు నియోజకవర్గ ప్రజలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఇంకా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఏపీఎండీసీ ఎండీ వైస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఇ.జి.వెంకటరెడ్డి తెలిపారని సీపీవో వెంకటరమణ విలేకరుల సమావేశంలో తెలిపారు.

## శంకరన్నా.. నీ విజయానికి తిరుగు లేదన్నా

– తెలుగు తమ్ముళ్ల భరోసా

బి.కొత్తకోట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ గురువారం రాత్రి అనుకోకుండా బి.కొత్తకోట జ్యోతి బస్టాండులో ప్రత్యక్షమయ్యారు. ఆయన రాక తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున తరలివచ్చి క్షేమ సమాచారాన్ని అడిగారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండులో టీ తాగుతూ కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరిస్తూ ఎలా ఉన్నారని అడిగి తెలుసుకొని పార్టీ విషయాల గురించి చర్చించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన లోకేష్ యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభించిందని తంబళ్లపల్లె నియోజకవర్గంలో మీకు తిరుగు లేదు శంకరన్నా అంటూ చెప్పడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పోరాడి తెదేపాను గెలిపించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి చంద్రబాబు నాయుడు గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం కార్యకర్తలు ఎన్టీఆర్ అమర్ రహే, చంద్రబాబునాయకత్వం వర్ధిల్లాలి, లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు ఓల్ కోఆర్ని ఏటర్ కుదుము శ్రీనివాసులు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్, మోటుకు శివ, సుకుమార్, మాజీ ఉపసర్పంచ్ షమీవుల్లా, రియాజ్ అలీఖాన్, బీరంగి ఆనంద్ పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త



ఈనెల 15న శనివారం స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కోరారు. గురువారం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. వేలాదిమంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కానున్న జాబ్‌మేళాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణకు సూచించారు. రిజిస్ట్రేషన్, భోజన ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. రాజంపేట నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి నిరుద్యోగులు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. పలు ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని, అభ్యర్థులు తమ ప్రతిభను చాటి ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట వైసిపి నేతలు కె.శరత్‌కుమార్‌రాజు, కౌన్సిలర్‌లు కూండ్ల వెంకటరమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పిండిబోయిన రాముయాదవ్, ఒంటిమిట్ట ఎంపిపి జనార్దన్‌రెడ్డి, విశ్వనాథ్‌రాజు, ఎస్ఐ బత్సవత్సలం తదితరులు పాల్గొన్నారు.

## వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



బద్వేలు మున్సిపాలిటీ 34 వ వార్డులో కౌన్సిలర్ ఉమ వార్డ్ ఇంఛార్జి అనిల్ కుమార్ రాజు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వార్డులో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అని అడిగి ప్రభుత్వం తీరుపై ప్రజా అభిప్రాయాల సేకరణ తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో తోట వెంకటసుబ్బయ్య, అంజాద్ టైలర్ వెంకట సుబ్బయ్య, మునగా గోవింద్, మౌలాలి, పోలయ్య వాలంటీర్లు మరియు గృహ సారధులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## కెఎస్ఆర్ఎమ్‌లో రాష్ట్ర స్థాయి ఫెస్ట్ ఆరంభం



కడప, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

కడప నగర శివారులోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శివానంద స్మరణం రాష్ట్ర స్థాయి ఫెస్ట్ కనెక్ట్-2కె23 కార్యక్రమం గురువారము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కళాశాల పూర్వ విద్యార్థిని (2009-13) బ్యాచ్ ఈసీఈ బ్రాంచ్ విద్యార్థిని ఎం శ్రీలత డి.ఎస్.పి రాజమండ్రి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థి ఉద్దేశించి మాట్లాడుతూ నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యలో ఇటు తల్లిదండ్రులకు, కళాశాలకు భావితరాల వారికి స్ఫూర్తి కలిగే విధంగా, అటు సమాజానికి ఉపయోగపడే విధంగా ఎన్నోవేటివ్, కొత్త ఆవిష్కరణలకై కళాశాల వనరులు అధ్యాపక సిబ్బంది వారి మార్గదర్శకాలను సలహాలను పాటించి ఉన్నత రంగాలలో స్థిరపడాలని క్రమశిక్షణ కృషి పట్టుదలతో ఉంటే ఏదైన సాధించవచ్చునని, మేము చదువుకున్నప్పటి నాటి నుండి నేటికీ కళాశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, పటిష్ట ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వివిధ శాఖల వారీగా టెక్నికల్ (1850) నాన్ టెక్నికల్(550) మంది విద్యార్థులు ఈవెంట్లలో సివిల్ ఇంజనీరింగ్ (నిర్మాణ్), కంప్యూటర్ సైన్స్ (టెక్నో వేషన్), ఈ ఈ ఈ (ఇషణా), ఈ సీ ఈ (అవలాంచే), నాన్ టెక్నికల్ ఆర్ట్ క్లబ్, కల్చరల్ క్లబ్, ఫోటోగ్రఫీ క్లబ్, లిటరసీ క్లబ్, నేచర్ క్లబ్, వంటి ఈవెంట్లకు రాయలసీమలో వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుండి పత్ర సమర్పణ, ప్రాజెక్టు ఎక్స్ పో, పేపర్ ప్రజెంటేషన్‌లకు 2400 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇలాంటి కార్యక్రమం ద్వారా విద్యార్థులలో ప్రతిభను, ఆధునిక సాంకేతికను వెలికితీయడానికి దోహదపడతాయని, ప్రముఖ సంస్థలతో ఆదిత్య బిర్లా గ్రూప్, ట్రయోవిజన్, ఇండియన్ సర్వీసెస్, ఐబీఎం, వంటి సంస్థల ముఖ్య కార్యనిర్వాహక సిబ్బందికి సన్మాన చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ శ్రీ కందుల మదన్మోహన్ రెడ్డి, కరస్పాండెంట్, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రధానాచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధిపతులు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వెంకట రమణ, సమన్వయకర్త లీనా రాస్తాపూర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది వివిధ కళాశాల నుండి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి

బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:



బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రేపు శనివారం నంద్యాల పట్టణానికి చెందిన శాంతిరాం ఆసుపత్రి వైద్య నిపుణులు గుండె సంబంధించిన వ్యాధులను పరిశీలించుటకు విచ్చేయుచున్నారు విశ్రాంత ఉద్యోగులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బద్వేల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షి రెడ్డి తెలిపారు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుండె సంబంధించిన చికిత్సకు వచ్చేవారు వారి వెంట హెల్త్ కార్డు ఆధార్ కార్డు తప్పక తీసుకురావాలని చెప్పడం జరిగింది గుండెకు సంబంధించిన ఈసీజీ ఏకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని గుండె సంబంధించిన జబ్బులు ఉన్నవారికి నంద్యాలలో చికిత్సలు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులందరూ రేపు ఉదయం 9 గంటలకే బద్వేల్ పెన్షన్ కార్యాలయం కు రావాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి గంగన్న పాల్గొన్నారు.

## మదిరేపల్లెలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

దువ్వూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



తెదేపా మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మదిరేపల్లె గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మైదుకూరు నియోజకవర్గం తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు కారపురెడ్డి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఉందన్నారు. ప్రస్తుత వైకాపా పాలనలో ప్రజలకు ఇబ్బందులున్నాయని అభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్షుమయ్య యాదవ్, శివరామిరెడ్డి, ఎల్లయ్య, ఎల్లాలరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.21.40లక్షలు

– అండగా ఉంటామని ఎస్పీ భరోసా

కడప క్రైం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



ఆర్కే వ్యాలీ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ జి.వెంకట శివ(పీసీ 2860) సతీమణి లక్ష్మీ ప్రసన్నకు రూ.21.40లక్షలు ప్రమాద బీమా మొత్తాన్ని గురువారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అన్బురాజన్ కానిస్టేబుల్ వెంకట శివ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎన్.జ్యోతి, పి సెక్షన్ సూపరింటెండెంట్ ఇ.సురేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, ఉపాధ్యక్షులు, ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

– ఎంపీపీ చీర్ల నాగమ్మ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఓబులవారిపల్లె మండల పరిధిలోని చిన్నఓరంపాడు క్రాస్ రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ మహోత్సవాన్ని కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలు ఆయన అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చీర్ల నాగమ్మ సూచించారు. భారతరత్న ప్రపంచ మేధావి ప్రపంచ జ్ఞాని అయిన ఆదర్శమూర్తి, బహుజనుల పితామహుడు, ఆశాజ్యోతి అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శేష సాయి ఆలయంలో స్వామి వారికి క్షీరాభిషేకం

తంబళ్లపల్లె, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె సమీపంలోని శ్రీ శేష సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం ఉదయం నుంచి సాయిబాబా స్వామి వారికి వందలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు, సహస్ర నామార్చనతో పాటు క్షీరాభిషేకం ఆలయ ప్రధాన అర్చకులు స్కంద మూర్తి శర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ నిర్వాహకులు సుధాకర్, వెంకటేష్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి శేష సాయిబాబా ఆలయంలో స్వామి వారి ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. సాయిబాబా గుడికి తంబళ్లపల్లె మండలం నుంచి కాక ములకల చెరువు పెద్దమండెం మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు త్వరలో వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.